అయోధ్య రామ మందిరం

ఆన్ వీల్స్

- ముందుగా దేవీబాగ్ మందిరంలో ప్రత్యేక పూజలు
- అనంతరం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు
- వచ్చే నెల 15 వరకు ప్రదర్శన

చార్మినార్: అయోధ్య వెళ్లి స్వయంగా రామ మందిరాన్ని కళ్లారా చూడ లేని వారి సౌకర్యార్థం బహదూర్‌పురాలోని సుధాకార్స్ మ్యూజియంలో తయారైన 'అయోధ్య మందిర్ ఆన్ వీల్స్'గురువారం సాయంత్రం కదిలింది. రామ మందిర నిర్మాణంతో కూడిన నమూనా ఇక్కడి శ్రీరాముని భక్తులకు అందుబాటులోకి వచ్చింది. మెటల్ స్ట్రక్చర్, ఫైబర్ గ్లాస్ బాడీతో రూపొందిన ఈ మందిరం 26 అడుగుల ఎత్తుతో నిర్మితమైంది. రెండేళ్ల నుంచి సుధా కార్స్ మ్యూజియంలో రూపుదిద్దుకున్న ఈ అయోధ్య రామ మందిరం నమూనా పూర్తి కావడంతో దేవీబాగ్‌లోని మందిరానికి తరలించారు. బెంగళూర్ జాతీయ రహదారిలోని బహదూర్‌పురా ప్రధాన రోడ్డుపై కదులుతూ ముందుకెళుతున్న మందిరాన్ని చూసిన స్థానికులు జై శ్రీరాం అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. దేవీబాగ్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు తరలించి వచ్చే నెల 15వ తేదీ వరకు ఉచితంగా భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు. రంగు రంగుల విద్యుత్ దీప కాంతుల నడుమ భక్తి గీతాలు, కీర్తనలతో ఈ రామ మందిర నిర్మాణం భక్తులను మంత్రముగ్దులను చేస్తోంది. 2600 సీసీ ఇంజన్ కెపాసిటీ గల 307 మెటాడోర్ ఫోర్ వీలర్ వేహికల్‌పై దీనిని తయారు చేశారు. ఎక్కడికంటే అక్కడికి దాదాపు 60 కిలో మీటర్ల వేగంతో ఇది ముందుకు దూసుకు పోతుందని గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత, ఈ నమూనా రూపకర్త సుధాకర్ తెలిపారు. మందిరంలో విగ్రహాలను సైతం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.


దేవీబాగ్ మందిరం వద్ద ఘనంగా స్వాగతం పలుకుతున్న రామ భక్తులు

దరఖాస్తుల ఆహ్వానం

అబిడ్స్: నందనవనంలో ఉన్న తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల, జూబ్లీహిల్స్ బాలుర-1 పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. 5వ తరగతి, ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ నందు ప్రవేశాలకు మైనార్టీ, నాన్ మైనార్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, 6, 7, 8 తరగతులకు మైనార్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని, ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరానికి మెరిట్ ఆధారంగా అడ్మీషన్లు ఇస్తామని, 5వ తరగతిలో నాన్ మైనార్టీ విద్యార్థులను లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేస్తామని ప్రిన్సిపల్ పైళ్ల ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మైనార్టీ అడ్మీషన్లు ముందుగా అప్లయ్ చేసుకున్న వారికి ముందుగా సీట్లు కేటాయిస్తామన్నారు. ఆసక్తిగల విద్యార్థులు గురువారం నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా (www.tmreis.telenagana.gov.in) ద్వారా లేదా పాఠశాల కార్యాలయం నందు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ ప్రకాష్‌రెడ్డి వెల్లడించారు. ఇతర వివరాలకు 79950 57895 లో సంప్రదించాలని సూచించారు.

ఫేక్ ఎస్సీ సర్టిఫికెట్ జారీపై పోలీసులకు ఫిర్యాదు


ఫేక్ ఎస్సీ సర్టిఫికెట్‌ను చూపిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్

దూద్‌బౌలి: తప్పుడు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాల జారీలో నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతూ బహదూర్‌పురా తహసీల్దార్ చంద్రశేఖర్ కామాటిపురా పోలీసులను కోరారు. రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. నూర్‌ఖాన్ బజార్‌కు చెందిన ఓ ఎస్సీ మహిళ తనకు అబ్దుల్లాపూర్ మెట్‌లో డబుల్ బెడ్ రూం మంజూరైందని.. ఇందుకోసం ఎస్సీ ధ్రువీకరణ సర్టిఫికెట్ కావాలంటూ గతంలో బహదూర్‌పురా మండల కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంది. సరైన పత్రాలను జత చేయలేదని పేర్కొంటూ ఆమె దరఖాస్తును సంబంధిత తహసీల్దార్ అధికారులు తిరస్కరించారు. ఎంతకూ తనకు కావాల్సిన ఎస్సీ ధ్రువీకరణ పత్రం అందకపోవడంతో బ్రోకర్‌ను ఆశ్రయించింది. ఇదే అవకాశంగా భావించిన బ్రోకర్ 30-10-2023న జానకీ తహసీల్దార్ పేరుతో ఫేక్ ఎస్సీ సర్టిఫికెట్‌ను తయారు చేయించి అందజేశారు. వాస్తవానికి ఆ తేదీన ప్రస్తుతం కొనసాగుతున్న చంద్రశేఖర్ తహసీల్దార్‌గా ఉన్నారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు కామాటిపురా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

నియామకం


ఆర్.కృష్ణయ్య చేతులు మీదుగా నియామక పత్రాన్ని అందుకుంటున్న దుంపల అమర్‌నాథ్

దబీర్‌పురా: జాతీయ బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా దుంపల అమర్‌నాథ్ నియమితులయ్యారు. గురువారం ఆయన బీసీ సంక్షేమం సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య చేతులు మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ.. బీసీల రాజ్యాధికారం కోసం ఆర్.కృష్ణయ్య ఆదేశాల మేరకు పోరాటం చేస్తానన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవీని అప్పగించినందుకు ఆర్.కృష్ణయ్య, కోట్ల శ్రీనివాస్, గజ్జు కృష్ణయ్యకు ప్రత్యేక ధన్యవాదాలన్నారు. టీపీసీసీ సెక్రటరీ కోట్ల శ్రీనివాస్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జు కృష్ణ, టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ కన్వీనర్ బోనగిరి చంద్రశేఖర్, రాజ్‌కుమార్, రామకృష్ణ, శివ, బిరేందర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలను పాటించాలి

చాంద్రాయణగుట్ట: ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ వాహనదారులు ప్రమాదాలకు దూరంగా ఉండాలని దక్షిణ మండలం ఆర్టీవో జి.సదానందం తెలిపారు. రోడ్డు భద్రతా మహోత్సవం సందర్భంగా గురువారం వాహనదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీవో సదానందం, ఎంవీఐ టీవీ రావ్ మాట్లాడుతూ..ప్రపంచంలోనే రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్న ఘటనలు మన దేశంలోనే ఎక్కువగా నమోదువుతన్నాయన్నారు.

ఆధ్యాత్మిక భావాలు పెంపొందించేందుకు కృషి


కామ్లేకర్ సందీప్ కుమార్

అబిడ్స్: భక్తులలో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించేందుకు దేవాలయ రక్షణ సమితి తెలంగాణ ఆధ్వర్యంలో ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఆ సమితి అధ్యక్షుడు కామ్లేకర్ సందీప్‌కుమార్ పేర్కొన్నారు. ఈనెల 22న సీతారామ్‌బాగ్‌లోని శ్రీ సీతారామ ఆలయంలో ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు వేడుకలు ప్రారంభిస్తామన్నారు. రాత్రి వరకు వివిధ రకాల పూజలు నిర్వహిస్తామన్నారు. కమ్లేష్ ఆచార్యజీ మహంత్, ఆచార్య గంగోత్రి రామానుజదాస్‌జీ, వైష్ణవ గంగోత్రి మఠం, గంగోత్రి దామ్, ఆధ్యాత్మిక గురువులచే ఈ పూజా వేడుకలు చేపడుతున్నట్లు తెలిపారు. నిర్వాహకులు పంకజ్‌కుమార్, బ్రిజ్‌మోహన్ సింగ్, కైలాస్ లాల్, పరమేశ్వరీ, జస్మత్ పటేల్, క్రాంతికుమార్ ఈ వేడుకల్లో పాలుపంచుకుంటారని తెలిపారు.

పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోపెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ బల్దియా కమిషనర్ రోనాల్డ్ రోస్‌ను కోరారు. గురువారం కమిషనర్‌తో కలిసి ఆయన నానల్‌నగర్, టోలిచౌకీ, గోల్కొండ తదితర డివిజన్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న అబివృద్ధి పనులతో పాటు బుల్కాపూర్ నాలా పనులను కూడా పరిశీలించారు. బుల్కాపూర్ నాలా విస్తరణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. వర్షాకాలంలో బుల్కాపూర్ నాలా పొంగిపొర్లుతూ పరిసర ప్రాంతాల వారిని భయభ్రాంతులకు గురి చేస్తుందని ఆయన అన్నారు. కార్వాన్, లంగర్‌హౌస్ తదితర ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా మారాయని, రోడ్ల పనులను వెంటనే చేపట్టాలని ఆయన కోరారు. పలు ప్రాంతాల్లో బాక్స్ టైప్ డ్రైనేజీ పనులు ఇంకా పూర్తి కాలేదని ఆ పనులు నెమ్మదిగా జరుగుతున్నాయన్నారు. దీన్ని వల్ల ఆ ప్రాంతాల్లో స్థానికులే కాకుండా ఆదారి గుండా రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్‌తో పాటు బల్దియా అధికారులు ఉన్నారు.


బుల్కాపూర్ నాలాను పరిశీలిస్తున్న బల్దియా కమిషనర్ రొనాల్డ్ రోస్, ఎమ్మెల్యే కౌసర్

ఘనంగా సీతారాముల కల్యాణోత్సవం


కల్యాణోత్సవంలో వేదపండితులతో పాటు మాధవీలత కొంపెల్ల

చార్మినార్: దేవీబాగ్‌లో సీతారాముల కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ముందుగా దేవీబాగ్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సీతారాముల విగ్రహాలను పల్లకీలో ఉంచి కల్యాణ వేదిక వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. స్థానికంగా నివాసం ఉండే తొమ్మిది మంది దంపతులతో వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ఈ కల్యాణోత్సవం జరిగింది. అయోధ్యలో రామ మందిర ప్రాణ ప్రతిష్టను పురస్కరించుకుని లతామా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు మాధవీలత కొంపెల్ల ఆధ్వర్యంలో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని శాసన సభ నియోజకవర్గాల్లో వరుసగా ఆరు రోజుల పాటు సీతారామ కల్యాణాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి బహదూర్‌పురా నియోజకవర్గంలోని దేవీబాగ్‌లో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. డాక్టర్ సరితా అగర్వాల్, దేవీబాగ్ ఆలయ నిర్వాహకులు శాంతిలాల్ వ్యాస్, నిఖిల్ వ్యాస్, రేవంత్ వ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వర్ణోత్సవం ప్రారంభం

సుల్తాన్‌బజార్: శ్రీ గుజరాతీ ప్రగతి సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ప్రగతి మహా విద్యాలయంలో గురువారం గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ స్వర్ణోత్సవ్ ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సుల్తాన్‌బజార్ ఏసీపీ ఎ.బాలగంగిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇలాంటి మహోన్నతమైన విద్యా సంస్థల్లో విద్యను అభ్యసించడం మీ అదృష్టం, కాబట్టి ఇలాంటి వ్యసనాలకు పోకుండా లేదా వ్యసనాలకు బానిస కాకుండా విద్యాబుద్ధులు నేర్చుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. సమాజ ఉపాధ్యాయుడు మహేష్ పటేల్ మాట్లాడుతూ..ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడంలో సమాజం ఎల్లప్పుడు ముందు వరుసలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సమాజ్ అధ్యక్షుడు గోవింద దాస్ షా, కార్యదర్శి రాహుల్ ఛేడా, జాయింట్ సెక్రెటరీ, డిగ్రీ కాలేజ్ కరస్పాండెంట్ గోపాల్ పటేల్, జూనియర్ కాలేజ్ కరస్పాండెంట్ జీతేన్ మజీథియా, కోశాధ్యక్షులు అంబాలాల్ పటేల్, భారతి బెన్ పటేల్, రాజేష్ షా, ఘన్ శ్యామ్ పటేల్, ప్రిన్సిపాల్, డాక్టర్ ఎ.మాధవిలత, పీజీ డైరెక్టర్ వై.కె.ఎం .నాయుడు పాల్గొన్నారు.


వేడుకల్లో సత్కారం చేస్తున్న దృశ్యం

బైక్ దొంగల అరెస్ట్

చాంద్రాయణగుట్ట: ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని చాంద్రాయణగుట్ట పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. చాంద్రాయణగుట్ట ఏసీపీ మనోజ్ కుమార్, ఇన్‌స్పెక్టర్ గురునాథ్‌తో కలిసి తెలిపిన వివరాల ప్రకారం..గోల్కొండకు చెందిన మహ్మద్ అజీజ్(19), లాల్‌దర్వాజాకు చెందిన మేరాజ్ షరీఫ్(20), చాంద్రాయణగుట్టకు చెందిన మహ్మద్ జానీ పాషా(21)లు స్నేహితులు. విలాసవంతమైన జీవనం గడిపేందుకు ద్విచక్ర వాహనాలను చోరీ చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలోనే ఇప్పటి వరకు ఆరు వాహనాలను చోరీ చేశారు. ఎంబీఎస్ఆర్ చౌరస్తాలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు చిక్కిన వీరు..పొంతన లేని సమాధానాలిచ్చారు. పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో దొంగతనాల చిట్టా విప్పారు. ముగ్గురిని అరెస్ట్ చేసి ఆరు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో డీఐ రఘుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భాగ్యలక్ష్మి ఆలయంలో ముత్యాల తలంబ్రాలకు పూజలు

చార్మినార్: భద్రాచలం నుంచి అయోధ్యకు సీతారాముల స్వామి వారి ముత్యాల తలంబ్రాలను తీసుకెళ్తూ గురువారం ఉదయం చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖమ్మం బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ ఎస్.రామలింగేశ్వర్‌రావు సోదరుల ఆధ్వర్యంలో ఈ ముత్యాల తలంబ్రాలను భద్రాచలం నుంచి అయోధ్యకు కానుకగా తీసుకెళ్తున్నారు. శ్రీరాముని రథ యాత్రను ప్రత్యేకంగా తయారు చేయించిన రామలింగేశ్వర్‌రావు వెండి పాత్రలో భద్రాచలం సీతారాముల స్వామి వారి ముత్యాల తలంబ్రాలతో అయోధ్యకు ఊరేగింపుగా బయలు దేరారు. ఆలయం ట్రస్టీ శశికళతో పాటు గోల్కొండ్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి టి.ఉమామహేంద్ర తదితరులు ముత్యాల తలంబ్రాల రథానికి ఆలయ మర్యాదలతో ప్రత్యేకంగా స్వాగతం పలికి పూజలు నిర్వహించారు.


ప్రత్యేక పూజల కోసం వచ్చిన భద్రాచలం ముత్యాల తలంబ్రాలు

అభివృద్ధి పనుల పరిశీలన

గోల్కొండ: తెలంగాణ వైద్య విధాన పరిషత్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సునీత గురువారం గోల్కొండ ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆసుపత్రిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా ఆసుపత్రిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమెకు వివరించారు. ముందుగా ఆసుపత్రి ప్రాంగణంలో ప్రసుతి విభాగం పక్కన ఏర్పాటు చేస్తున్న షెడ్‌ను ఆమె పరిశీలించారు. అనంతరం ఇన్ పేషంట్ వార్డులో జరుగుతున్న వాల్ పెయింటింగ్ పనులను ఆమె పరిశీలించారు. ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ ఆసుపత్రి అభివృద్ధితో పాటు ఆసుపత్రిల్లో అభివృద్ధి పనుల విషయమై ప్రత్యేక చొరవ చూపుతున్నారని ఈ సందర్భంగా డాక్టర్ మహ్మద్ మజహరుల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ శ్రీనివాస్‌రావు, డాక్టర్ గోపాల్ తదితరులున్నారు.


గోల్కొండ ఆసుపత్రిలో పర్యటిస్తున్న డాక్టర్ సునీత

కాలభైరవ హనుమాన్ మందిరంలో మహా యజ్ఞం



చార్మినార్: అయోధ్యలో ఈనెల 22న రామ మందిర ప్రాణ ప్రతిష్ట సందర్భంగా ఎక్కడ ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా లోక కల్యాణార్థం పాతబస్తీలో శ్రీరాముని భక్తులు గురువారం ఉదయం మహా యజ్ఞం నిర్వహించారు. కాలభైరవ హనుమాన్ మందిరంలో జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో బీజేపీ గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఉమామహేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము ఇప్పటికే ప్రతిరోజూ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రాణ ప్రతిష్ట జరిగే రోజు ప్రత్యక్ష ప్రసారం కోసం బిగ్ స్క్రీన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు. చార్మినార్ బీజేపీ కన్వీనర్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఏడుగురి అదృశ్యం



ముగ్గురు పిల్లలతో గృహిణి


రోషిణి


నితీష్


నిహాల్

అబిడ్స్: ఒరిస్సా నుంచి నగరానికి వచ్చిన భార్యాభర్తలు గొడవపడడంతో అతని భార్య తన ఇద్దరు పిల్లలతో సహా అదృశ్యమైన ఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వడ్డెర బస్తీలో చోటు చేసుకుంది. ఎస్ఐ షేక్ అస్లామ్ తెలిపిన వివరాల ప్రకారం..వడ్డెర బస్తీకి చెందిన నితిన్, రోషిని దంపతులకు నితీష్ (17 నెలలు), నిహాల్ (3నెలలు) వయస్సు గల ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఒరిస్సా చెందిన వీరు నగరానికి వచ్చి వడ్డెర బస్తీలో స్థిరపడి హౌస్ కీపింగ్ పని చేస్తున్నారు. పుట్టింటికి వెళ్లేందుకు సిద్ధమైన ఆమెను భర్త అడ్డుకోవడంతో వీరి మధ్య ఘర్షణ జరిగింది. బుధవారం రాత్రి చెప్పా పెట్టకుండా ఇద్దరు చిన్నారులతో కలిసి ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ విషయమై ఆమె భర్త నితిన్ మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

భర్తతో గొడవపడి...

భర్తతో గొడవ పడి ముగ్గురు పిల్లలతో కలిసి గృహిణి అదృశ్యమైన ఘటన మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుఫానగర్‌లో చోటుచేసుకుంది. ఎస్.ఐ. షేక్ అస్లామ్ తెలిపిన వివరాల ప్రకారం..గుఫానగర్‌కు చెందిన ఝూర్జు, లక్ష్మీ పాపద్వాలే దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. మెకానిక్ అయిన ఝూర్జు తరచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. 12న మద్యం తాగి ఇంటికి వచ్చిన అతను భార్య లక్ష్మితో గొడవపడ్డాడు. మనస్తాపానికి గురైన ఆమె 13న తెల్లవారుజామున 3 గంటలకు కుమారుడు సాయికుమార్, కూతుళ్లు మమత, గీతను తీసుకొని స్కూటీపై వెళ్లిపోయింది. ఉదయం నిద్ర లేచేసరికి భార్య పిల్లలు కనిపించకపోవడంతో ఝూర్జు చుట్టుపక్కల ప్రాంతాలు, సమీపంలోని బంధువుల ఇళ్లకు వెళ్లి వాకాబు చేశాడు. ఆచూకీ లభించకపోవడంతో మంగళ్‌హాట్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు తప్పిపోయిన లక్ష్మీ పాపద్‌వాలే ఆమె ముగ్గురు పిల్లల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను నియమించి గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. తప్పిపోయిన మహిళ, ముగ్గురు పిల్లలకు సంబంధించిన ఆచూకీ, వివరాలు తెలిస్తే మంగళ్‌హాట్ పోలీసులకు సమాచారం ఇవ్వాల్సిందిగా ఎస్ఐ.షేక్ అస్లామ్ కోరారు.

'యేసుదాసు గీతాలు తెలుగువారి మదిలో పదిలంగా ఉంటాయి'

గన్‌ఫౌండ్రీ: పద్మవిభూషణ్ కె.జె.యేసుదాసు పాటలు తెలుగువారి మదిలో చిరస్థాయిగా నిలిచి ఉంటాయని ప్రముఖ సినీ నటుడు మురళీమోహన్ అన్నారు. గురువారం రవీంద్రభారతిలో శ్రీ వాసవి ఆర్ట్స్ ఆధ్వర్యంలో యేసుదాసు 84వ జన్మదినం సందర్భంగా నిండు చందమామ పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సినీ, జానపద గీతాలాపనతో యేసుదాసు ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేసుకున్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న పలువురిని సన్మానించారు. రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దామోదర్‌గుప్తా, సినీ సంగీత దర్శకుడు వాసురావు, సినీ నటుడు ప్రదీప్, సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞ శర్మ, సంస్థ వ్యవస్థాపకులు ముకుటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

బాలుడిపై పెంపుడు కుక్క దాడి


గాయపడిన శ్రీ చక్ర

గోల్కొండ: ఓ పెంపుడు కుక్క తన యజమానినే కరిచింది. ఉప్పల్‌కు చెందిన శ్రీ చక్ర (15) బుధవారం సాయంత్రం తన ఇంట్లోని సోఫాపై పడుకున్నాడు. ఈ సమయంలో వారి ఇంటి పెంపుడు కుక్క సైతం సోఫా కిందనే ఉంది. నిద్ర లేచిన శ్రీచక్ర అనుకోకుండా సోఫా కింద ఉన్న కుక్కను తొక్కాడు. దీంతో ఆ కుక్క శ్రీచక్రపై దాడి చేసి కరిచింది. ఈ ఘటనలో శ్రీచక్ర కుడి కంటికి గాయాలయ్యాయి. అతడి కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఆయనను మెహిదీపట్నంలోని సరోజిని కంటి ఆసుపత్రిలో చేర్పించారు.

కత్తులతో బెదిరించిన ఇద్దరికి జైలు

విజయనగర్‌కాలనీ: కత్తులతో స్థానికులను బెదిరించిన ఇద్దరు వ్యక్తులకు న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం..ఆసిఫ్‌నగర్ జేబా బాగ్‌కు చెందిన షేక్ కమాల్(30), టోలీచౌకీ హకీంపేటకు చెందిన మహ్మద్ అమీన్ హుస్సేన్(25) వీరు ఇద్దరు స్నేహితులు. మూడు రోజుల క్రితం జేబాబాగ్‌లోని ఇమ్లిబాడ్ ప్రాంతంలో కత్తులు పట్టుకుని సంచరిస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేశారు. అడ్డుకునేందుకు వెళ్లినవారిని బెదిరించారు. సమాచారం అందుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసిన ఎస్.ఐ. హైమా వారిని కోర్టులో హాజరుపరచగా నిందితులకు మూడురోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి సత్యనారాయణ తీర్పు ఇచ్చారు.

22న ఇంటింటా సంబరాలు


ఆనంద్ మరిపల్లి

అబిడ్స్: ఈ నెల 22న ఇంటింటా అయోధ్య సంబరాలు అంబరాన్నంటే విధంగా చేపడుతామని ఆర్ఎస్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ నాయకుడు ఆనంద్ మరిపల్లి పేర్కొన్నారు. దీపావళి సంబరాలు తలపించే విధంగా ప్రతి ఇంటా అయోధ్య సంబరమే ఉంటుందన్నారు. గురువారం పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజలకు అయోధ్య సంబరాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. 22వ తేదీ ప్రతి ఇంట్లో 5 దీపాలు వెలిగించాలన్నారు. 500 ఏళ్ల క్రితం నాటి అయోధ్య ఆలయం ప్రాణ ప్రతిష్ట ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ఆడంబరంగా చేపడుతున్నామన్నారు.

మహేష్ కుమార్ గౌడ్‌కు సత్కారం


మహేష్‌కుమార్ గౌడ్‌ను సత్కరిస్తున్న నిర్మల్‌కుమార్ యాదవ్ తదితరులు

అబిడ్స్: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీగా నియమితులైన మహేష్‌కుమార్ గౌడ్‌ను ఘనంగా సత్కరించారు. కొన్ని సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గ్ కొనసాగుతున్న మహేష్‌కుమార్ గౌడ్‌ను కాంగ్రెస్ అధిష్టానం ఎమ్మెల్సీగా నియమించింది. గోషామహల్ నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి నిర్మల్‌కుమార్‌యాదవ్ మహేష్‌కుమార్ గౌడ్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఇస్తుందన్నారు.

ఖాళీ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి

నాంపల్లి: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న నాల్గవ తరగతి ఉద్యోగులను వెంటనే భర్తీ చేయాలని తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గద్దం జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ ఓ సంయుక్త ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇటీవల జరిగిన కేంద్ర సంఘం ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని వారు వివరించారు. ఈ సందర్భంగా జనవరి 22న సోమవారం 7 గంటలకు నాంపల్లి గృహకల్ప భవన సముదాయంలోని నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర కార్యాలయంలో మహా చండీయాగం ఉంటుందని తెలిపారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు గద్దం జ్ఞానేశ్వర్ అధ్యక్షతన నూతన కార్యవర్గం బాధ్యతలను స్వీకరిస్తుందని తెలిపారు. అలాగే ఉద్యోగుల సమస్యలపై చర్చించడం జరుగుతుందని తెలిపారు.

ప్రొ.జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర సిద్ధాంత కర్త ఆచార్య జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం అధ్యక్ష కార్యదర్శులు వేములవాడ మదన్‌మోహన్, చొల్లేటి కృష్ణమాచార్యులు డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి ఆల్విన్‌కాలనీలో కొంతమంది దుండగులు తప్పతాగి ప్రొ.జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడానిన తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాలుకోట వెంకటాచారి, కోశాధికారి రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


మహేష్‌కుమార్ గౌడ్‌ను సత్కరిస్తున్న వెంకటేష్

చార్మినార్: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేస్‌కుమార్ గౌడ్‌కు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం అరుదైన గౌరవమని చార్మినార్ నియోజకవర్గం కాంగ్రేగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేష్ అన్నారు. మహేష్‌కుమార్ గౌడ్ గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్సీగా నామినేషన్ దాఖలు చేసిన అనంతరం గాంధీభవన్ వచ్చిన ఆయనను కె.వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

22న హనుమాన్ ఆలయంలో అయోధ్య వేడుకలు



అబిడ్స్: ఈ నెల 22న లక్డీకాపూల్ (ఖైరతాబాద్) హనుమాన్ ఆలయంలో అయోధ్య సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు శ్యామ్ మహారాజ్, రాజు మహరాజ్, అజయ్ మహారాజ్ తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు హనుమాన్ ఆలయంలో అభిషేకం, 5 గంటలకు కల్యాణం, 6 గంటలకు పాల్కీసేవా, 6.30 గంటలకు రథయాత్ర వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు అయోధ్య సంబరాల సందర్భంగా భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తామన్నారు. సోమవారం శ్రీరామ్‌లాల ప్రాణప్రతిష్ట వేడుకలు తమ ఆలయంలో కనుల పండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళి



గౌలిపురా: ఎన్టీరామారావు 29వ వర్ధంతిని గురువారం గౌలిపురా డివిజన్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మాజీ కార్పొరేటర్ జి.శంకర్ ముదిరాజ్, నియోజకవర్గం ఇన్‌చార్జి ఎం.ఎ.షేక్ షఫిక్ షర్ఫన్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.వై.శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు యాదయ్య, ఆర్.అజయ్, సత్యకృష్ణ, జలీల్, లక్ష్మణ్, మహేశ్ పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన దాబాలు, హోటళ్ల నిర్వాహకులపై కేసు

అబిడ్స్: అర్ధరాత్రి దాటినా తర్వాత కూడా నిర్వహిస్తున్న దాబాలు, హోటళ్ల నిర్వాహకులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంతోష్ బాలాజీ దాబా, కృపా టిఫిన్ సెంటర్, ఆర్‌కే.టిఫిన్ సెంటర్, రాయల్ టిఫిన్ సెంటర్‌పై పోలీసులు కేసులు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. పోలీసుల నిబంధనల ప్రకారం రాత్రి 11 గంటలు దాటినా నడుపుతున్న సంతోష్ బాలాజీ దాబా, ఆర్‌కే టిఫిన్ సెంటర్, కృపా టిఫిన్ సెంటర్, రాయల్ టిఫిన్ సెంటర్‌లపై వీడియోలు చిత్రీకరించి కేసులు నమోదు చేశామన్నారు.

శుభాకాంక్షలు

యాకుత్‌పురా: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను గురువారం టీపీసీసీ కార్యాదర్శి, సెట్విన్ శిక్షణ సంస్థ మాజీ డైరెక్టర్ కొప్పుల ప్రవీణ్‌కుమార్, సాలార్‌జంగ్ మ్యూజియం బోర్డు మాజీ సభ్యులు సీతారామారాజులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.